

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



(మార్టేరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 15-10-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆత్మను తెలుసుకోమని అందరూ చెబుతున్నారు. ఆత్మను తెలుసుకోవటానికి చాలా కష్టపడి ప్రయత్నం చేస్తున్నాము. కాని దాని జాడ కనబడటంలేదు అని అడుగుతున్నారు. లోపల ఉన్న ఆత్మ మన ఊహలకు, తలంపులకు అందదు, మనస్సుతో తెలుసుకొనేది కాదు, ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడ తెలియబడుతుంది. సత్కర్మలు ఆచరించటం, యజ్ఞాలు ఆచరించటం, ప్రవచనాలు వినటం ఇవి అన్నీకూడా అహంకార బుద్ధిని నశింపజేసి ఆత్మబుద్ధిని సంపాదించటానికే. వీటి అన్నింటియొక్క ప్రయోజనం ఇదే. ఇంట, బయట కూడా మనం ఆధ్యాత్మిక పరిస్థితులు కల్పించుకోవాలి. దానికి సంబంధించిన సహవాసములు చేయాలి, మనకు వచ్చే ఆలోచనలు, మనం చేసేపని, మన ఊహలు, గడిపేక్షణాలు అన్నీ ఆధ్యాత్మిక పరంగా ఉండాలి. అలాగ ఉంటే అవి అహంకారబుద్ధి నశించటానికి సహకరిస్తాయి. మన తెలివి మీద ఉన్న నమ్మకం, డబ్బు మీద ఉన్న నమ్మకం కుటుంబం మీద ఉన్న నమ్మకం మనకు భగవంతుడి మీద లేదు. వివేకము, వైరాగ్యము, విచక్షణ మనకు లేకపోయినా ఇవి అన్నీ మనకు ఉన్నాయని అనుకొంటాము. భగవంతుడు పరీక్ష పెడితే మనకు ఇవి ఏమీలేవని తెలుస్తుంది.

దేహాన్ని బంధించేది, నడిపేది వాసన మాత్రమే. వాసనలు వేరుతో సహా నశిస్తేనే కాని జ్ఞానం కలుగదు. జీవత్వం అసత్యం, శివత్వం సత్యం, అసత్యమైన, కల్పితమైన జీవత్వమును తొలగించటానికి ఒక్క ఆత్మ విద్యకే సమర్థత ఉంది. ముందు జ్ఞానమును సంపాదించి కర్మ చేస్తే అది నీకు ఉపయోగపడుతుంది, సమాజానికి కూడా ఉపయోగ పడుతుంది. నీవు యోగనిష్టుడవై పనిచెయ్యి యోగ నిష్టలో ఉండి పనిచేస్తే అది పనికాదు యోగం అవుతుంది. మనం ప్రశాంతంగా కూర్చొంటే ఇంద్రియాలు మనస్సును బయటకు లాగుకొని పోతూ ఉంటాయి. అంటే మనస్సును ఇంద్రియాలు బాహ్యముఖంగా తీసుకొని పోతున్నాయి. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీద సజీవమైన విశ్వాసం ఉంటే మనస్సు బాహ్యముఖంగా వెళ్లటం ఆగి అంతర్ముఖమవుతుంది. మనస్సుకు పవిత్రత, ఏకాగ్రత, ప్రవీణత కావాలి. నిన్ను నీవు తెలుసుకో అని ఎందుకు చెబుతున్నారంటే నిన్ను నీవు తెలుసుకొంటే సుఖంకోసం, శాంతికోసం తిరిగి ఈ భూమిమీదకు రావలసిన అవసరం లేదు. నిజమైన నేను శివుడు, నేను అనే తలంపు జీవుడు. ఇది కల్పితము కల్పితమైన నేనును పోగొట్టుకొంటేగాని నిజమైన నేను వ్యక్తం కాదు. దేహం పుట్టినప్పుడు వ్యక్తి పుట్టలేదు అహంకార బుద్ధి పుట్టినప్పుడు వ్యక్తి పుట్టాడు. దేహంచనిపోయినప్పుడు వాడు చనిపోడు ఎందుచేతనంటే

దేహం పుట్టినప్పడు వాడు పుట్టలేదు కాబట్టి. అహంకార బుద్ధి పుట్టినప్పడు వాడు పుట్టాడు కాబట్టి అహంకారబుద్ది తొలిగినప్పడు వాడికి ఆనందస్థితి కలుగుతుంది.

ప్రతీ వాడికి నేను అనే తలంపు ఉంటుంది. ఇది మొదటి తలంపు. దీనినే మొదటి పొరపాటు, ప్రధాన పొరపాటు అన్నారు భగవాన్.ఈ పొరపాటు వచ్చాక మిగిలిన పొరపాట్లలోనికి కొట్టుకొని పోతున్నావు. నీకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. నేను సాధన చేస్తున్నాను అని చెప్పేది మనస్సే. నేను భగవంతుడి కోసం ప్రయత్నం చేస్తున్నాను భగవంతుడు తెలియటం లేదు అని చెప్పేది మనస్సే. ఇదే మూల తలంపు ఈ మూల తలంపు యొక్క మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. అందుచేత నీవు లోపలకు వెళితే తెలుస్తుంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా నీవు సమానంగా ఉండటం నేర్చుకొంటే సమత్వబుద్ధి కలుగుతుంది, అది యోగం అవుతుంది, అప్పడు మనస్సు నశిస్తుంది. భార్య అని, భర్తఅని, బంధువులు అని, స్నేహితులు అని ఇలా అనుకొంటూ వారిని చూసి పొంగిపోతున్నారు. ఇవి అన్నీ నిజం కాదు. ఒక్క రూపాయి దగ్గర తేడా వస్తే మొత్తం బంధుత్వాలు, స్నేహాలు పోతాయి. ఈ స్నేహాలు, బంధుత్వాలు నిజం అనుకొంటున్నారు. ఇంక వారికి జ్ఞానం ఏమి కలుగుతుంది అని కృష్ణుడు ఉద్దవుడితో చెప్పాడు. ఈ మాటలు కృష్ణుడు ఏనాడు చెప్పాడు ఇవి ఇప్పటికి సజీవ సత్యాలుగా ఉన్నాయి. ఈ బంధుత్వాలు, స్నేహాలు చూసుకొని నీవు జ్ఞాన సముపార్జనలో అశ్రద్ధగా ఉండకు. హృదయపూర్వకంగా ప్రయత్నం చెయ్యి. నది సముద్రంలో కలిస్తేగాని దాని నామ,రూపములు పోవు. అలాగే దేవుడు ఏ హృదయంలో ఉన్నాడో అక్కడ మునిగితే గాని నీకు నామబుద్ధి, రూపబుద్ధి నశించవు. నీకు వచ్చే తలంపులు నీ చైతన్య స్థాయిని పెంచేవిగా ఉండాలి. నీ కళ్ళతో ఏమైనా చూస్తే అది నీ హృదయంలో ఉన్న సత్యపదార్థాన్ని తెలుసుకోవటానికి నీ చూపు సహకరించాలి. నీవు చెవులతో ఏమైనా శ్రవణం చేస్తే ఆ శ్రవణం బ్రహ్మాన్ని తెలుసుకోవటానికి నీకు సహకరించాలి.

బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగపడే మాటలు జ్ఞాపకం ఉంచుకో. జ్ఞానం రావటానికి పనికిరాని మాటలను మర్చిపో. అక్కరలేని మాటలు నీవు జ్ఞాపకం ఉంచుకొంటే పనికిరాని మాటలు కూడా పనికి వచ్చే మాటలుగా నీకు కనిపించి అవి ఏమిచేస్తాయి అంటే నీ లోపలకు దూరి లోపల పనికి వచ్చే మాటలను బయటకు గెంటివేసి అవి దర్జాగా కూర్చొంటాయి. అందువలన మర్చి పోవలసిన మాటలను పూర్తిగా మర్చిపో, జ్ఞాపకం ఉంచుకోవలసిన మాటలను పూర్తిగా జ్ఞాపకం ఉంచుకో. భగవదనుభవం పొందటం పొందకపోవటం తరువాత విషయం అసలు భగవదనుభవం పొందాలి అనే సంకల్పం నీకు సుగుణాలు లేకపోతే రాదు అన్నారు భగవాన్. నీకు సుగుణ సంపద లేకపోతే భగవంతుని మీద తైలధార వలె ప్రేమ కలుగదు, ఆసక్తి కలుగదు, ఆప్యాయత కలుగదు. నిజమైన నేను నీకు మోహం కలుగజేయటం లేదు. ఆ మొదటి తలంపే అంటే మిథ్యానేనే నీకు మోహం కలుగజేస్తుంది. మొదటి పొరపాటు లేకపోతే మోహం లేదు. ఆ మొదటి పొరపాటే నిన్ను ఐకమత్యంగా ఉండనివ్వదు. నీకు నిజంగా సుఖం కావాలంటే నిజమైన నేను దగ్గరకు

వెళ్లవలసిందే. ఆధ్యాత్మికజీవితం వేరు, భౌతికజీవితం వేరు అని అనుకొంటున్నాము. ఇక్కడే ప్రమాదంలో పడుతున్నాము. దైనందిన జీవితంలో మన భౌతికజీవితం కూడా ఆత్మానుభవం పొందటానికి సహకరిస్తే దానిని పొందుతాము. ఆత్మ ఎప్పుడూ సహజంగా ఉంది.మన జీవితం సహజంగా ఉంటే అది మనకు తెలియబడుతుంది. భగవంతుని మీద తైలధారవలె,నదీ ప్రవాహంలగ మన ఇష్టం ప్రవహిస్తూ ఉంటే ఆయన గురించి మనకు ఏమీ తెలియక పోయినా ఆ ఇష్టమే భగవదనుభవం కలుగజేస్తుంది. మనం చేసే ప్రయత్నం సాత్వికంగా ఉండాలి రజోగుణంతో ఉండకూడదు. సత్వగుణం సహాయంతో రజోగుణాన్ని తమోగుణాన్ని పోగొట్టుకోవాలి. సత్వగుణం నిజం కాకపోయినా నిజం దగ్గరకు తీసుకొని వెళుతుంది కాబట్టి సత్వగుణాన్ని ఆశ్రయించాలి. బాల్యం, యవ్వనం, వార్ధక్యం, ఇవి అన్నీ దేహానికి సంబందించినవి. రాగ ద్వేషములు, అసూయ, కోపం, ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. వీటితో ఏమీ సంబందము లేకుండా వీటికి అతీతమైన వస్తువు ఒకటి మీ హృదయంలో ఉంది. కాని అది మీ దేహంలో ఒక భాగం కాదు. అది మీరే అన్న సంగతి మీకు అనుభవంలోకి రావటంలేదు. దానికి కారణం అజ్ఞానం. దానిని తొలగించుకోవటమే సాధన. అజ్ఞానం బయటలేదు. నీ మనో రూపంలో ఉంది. నీవు తెలుసుకోవలసిన వస్తువును తెలుసుకొన్నాక అంటే ఆత్మ గురించి నీకు తెలిస్తే ఆత్మానుభవం నీకు కలిగితే దేహం ఉన్నా లేకపోయినా నీకు పట్టింపు ఉండదు, బాధ ఉండదు. భగవాన్ ఈ భూమి మీదకు రావటానికి కారణం ఒక్కటే. అందరూ శాస్త్ర జ్ఞానానికి పరిమితమై పోయారు. ఆత్మకు సంబంధించిన అనుభవజ్ఞానం పూర్తిగా లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితులలో అనుభవ జ్ఞానం బోధించడానికి భగవాన్ ఈ భూమి మీదకు వచ్చారు. ఆయన వచ్చిన పని ఏమిటి అంటే పుస్తకాలలో ఏ వస్తువునయితే వర్ణించారో ఆ వస్తువు నీ హృదయంలోనే ఉంది. అక్కడ అన్వేషించు అది నీకు అనుభవంలోకి వస్తుంది. ఆత్మానుభవం అనేది ఒకటి ఉందని ఆ అనుభవజ్ఞానాన్ని నిరూపించటానికి ఈ భూమి మీదకు వచ్చారు గాని భగవద్గీత, ఉపనిషత్‌లు చెప్పటానికి రాలేదు. అవి చెప్పే పండితులు చాలామంది ఉన్నారు.

నీ లోపల ఉన్న మోహకలిలం నుండి బయట పడితే చూసేది ఏమీలేదు, వినేది ఏమీ లేదు. వేలాది జన్మలనుండి వింటున్న విషయాలమీద గాని, వినబోయేవిషయాల మీద గాని నీ మనస్సు వాలదు ఎందుచేతనంటే తెలుసుకోవలసిన వస్తువును తెలుసుకొన్నాక నీ మనస్సు అక్కడ నుండి జారదు అంటే ఆత్మ వస్తువును, బ్రహ్మ పదార్థాన్ని అంటిపెట్టుకొని ఉంటుంది గాని అక్కడ నుండి జారదు. మోహకలిలంనుండి బయటపడటానికి నీవుచేసే ప్రయత్నమే సాధన. ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము దాని జాడ తెలియటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగితే నీవు దేహవాసనలో ఉన్నంతసేపు ఆత్మవాసన జాడలేదు దాని గురించి తెలియదు అంటున్నారు భగవాన్. నేను సాధన చేసాను అంటున్నావు అంటే నీ దేహవాసన ఏమీ తగ్గలేదు. దేహవాసన తగ్గక పోతే ఆత్మవాసన జాడ తెలియదు. దేహవాసన నశిస్తే ఆత్మగురించి నీకు తెలుస్తుంది.

మనకు నామబుద్ధి, రూపబుద్ధి ఎక్కువ. ఇవి రెండూ మనలను పీడిస్తున్నాయి. పేరు వస్తుంది, గౌరవం వస్తుంది అంటేనే మనం పని చేస్తాము. పేరురాదు, గౌరవం రాదు అంటే అది మంచి పని అయినా కూడా ఆ పనిమనం చేయము. ఇవి అన్నీ అబద్ధమైన నేను కోరుతోంది గాని నిజమైన నేను ఏమీ కోరదు. శరీరం మరణించినప్పడు దుఃఖం కలుగుతుంది దుఃఖం శరీరానికి కలగటంలేదు. ఈ శరీరంతో తాదాప్యం చెందుతున్న నేనుకు కలుగుతోంది. ఈ జన్మలోనేకాదు వెయ్యి జన్మల తరువాత అయినా మన హృదయంలో మనం ఎవరుగా ఉన్నామో ఆసద్వస్తువు మనకు తెలిసే వరకూ మనం కాని దానితో తాదాప్యం చెందకుండా ఉండలేము. భగవంతుని రూపాన్ని ధ్యానం చేయగా చేయగా, భగవంతుని నామాన్ని స్మరించగా స్మరించగా మనస్సు భగవంతుని రూపాన్ని, నామాన్ని పట్టుకొని భగవంతుడు అయిపోతుంది. మన మనస్సు నిరంతరము ఏ వస్తువునయితే చింతిస్తోందో అదే మనం అయిపోతాము. అందువలన చేసే స్నేహాల విషయంలోను, చదివే పుస్తకాల విషయంలోను జాగ్రత్తగా ఉండమని చెప్పారు. నీవు ఏ పనిచేసినా నీ నామాన్ని, నీ రూపాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయకు. నీ నామం నుండి, రూపం నుండి బయటకు రా. నామబుద్ధి నుండి, రూపబుద్ధినుండి బయటకు వస్తే నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది.

మరణసమయంలో దేవుని తలపెట్టుకొంటే సరిపోతుంది అనుకొంటాము, అలారాదు జీవితం పొడుగునా దేని కోసం అయితే జీవిస్తున్నామో, నిరంతరం దేనినైతే తలపెట్టుకొంటున్నామో ఏ వస్తువునయితే ప్రేమిస్తున్నామో మృత్యు సమయంలో అదే తలంపు వస్తుంది. జీవితం పొడుగునా అభ్యాసం చేసింది వస్తుంది గాని దేవుని స్మరణ రమ్మంటే రాదు. మరణ సమయంలో నీవు అనుకొన్నది రాదు, హృదయంలో ఏ తలంపు అయితే బలంగా ఉందో అదే వస్తుంది. మరణసమయంలో జీవుడు ఏ తలంపునయితే పట్టుకొంటాడో దానిని బట్టి పునర్జన్మ వస్తుంది మరణసమయంలో భక్తుడు భగవంతుని తలచుకొంటాడు, లౌకికుడు లౌకిక విషయాలు తలచుకొంటాడు. జ్ఞానికి ఏ తలంపు రాదు. ఎందుచేతనంటే వాడి దేహానికి చావు రాక ముందే జ్ఞానాగ్నిలో వాడి జీవ లక్షణాలు అన్నీ కాలిపోయాయి. వాసనలు పూర్తిగా నశించకుండా జ్ఞాని అవ్వలేడు వాసనలు పూర్తిగా నశించకుండా ఆత్మకు సంబంధించిన అనుభవం ఏదైనా కలిగినా అది నిలబడదు. కొంతమంది చాలా నిర్వికారంగా ఉంటారు. ఏ సంఘటనకు చలించరు. గంభీరంగా, లోతుగా, ఉదాత్తంగా ఉంటారు. వారు జ్ఞానానికి తయారై ఉన్నారని అర్థం, వారికి జ్ఞానం కలుగుతుంది.

* * *